ప్రజాశక్తి
మంగళవారం 21 మార్చి 2023



ఇళ్ల నిర్మాణాలు వేగవంతం : కలెక్టర్

కలెక్టరేట్ : ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. డివిజన్, మండల అధికారులతో సోమవారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహ నిర్మాణాల్లో ప్రతి వారం వాటి నిర్మాణ దశల్లో ప్రగతి కనిపించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇంజినీరింగ్ సహాయకులు రూఫ్ కాస్టింగ్ (ఆర్‌సి) దశలో ఉన్న ఇళ్లను ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం సందర్శించాలని ఆదేశించారు. ఏప్రిల్ 15 నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. రీ సర్వే లక్ష్యం నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆయన చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంయుక్త కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి కృష్ణాజి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఒ.ప్రభాకరరావు, హౌసింగ్ పీడీ పి.రఘురాం, డిపిఒ బి.సత్యనారాయణ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె.రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధాలపై అంగన్‌వాడీల ఆగ్రహం

- ప్రధాన రహదారిపై బైఠాయింపు
- పోలీసుల అదుపులో సిఐటియు నాయకులు
- సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం

చలో విజయవాడను భగ్నం చేస్తూ ఆదివారం జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తల అరెస్టులు, గృహ నిర్బంధాలకు వ్యతిరేకంగా స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. తొలుత స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేయడానికి ప్రయత్నించగా పోలీసులు అందుకు నిరాకరించారు. దీంతో ఆగ్రహించిన అంగన్‌వాడీలు కలెక్టరేట్ కూడలి వద్ద గల ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. సుమారు గంటల పాటు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ పెద్దఎత్తున స్తంభించిపోయింది. ఆందోళన అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, కోశాధికారి జివి రమణను పోలీసులు అదుపులోకి తీసుకొని పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అలాగే పాలకొండలో సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ఆందోళన చేశారు.



పార్వతీపురం ప్రధానరహదారిపై బైఠాయించిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి -కలెక్టరేట్

ఎన్నికలకు ముందు సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేని పక్షంలో భవిష్యత్తులో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని, ఈరోజు చేపట్టి నిరసన కార్యక్రమం ఆరంభం మాత్రమేనని ప్రభుత్వాన్ని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మధరావు హెచ్చరించారు. అంగన్‌వాడీలపై ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్బంధాలను నిరసిస్తూ చేపట్టిన ఆందోళనుద్దేశించి ఆయన మాట్లాడారు. అంగన్వాడీలకు గ్రాడ్యుటీ అమలు చేయాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ అమలుకు బిల్లులు సక్రమంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆదివారం చలో విజయవాడకు బయలుదేరుతున్న అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులను అడ్డుకొని గృహ నిర్బంధించడం దుర్మార్గమని, ఇటువంటి అణిచివేత మార్గాలను ప్రభుత్వం ఎంచుకోవడం సిగ్గుచేటని, తమ హక్కుల కోసం పోరాడుతున్న వారిని నిర్బంధాలకు గురిచేస్తే భవిష్యత్తులో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. సమస్యలను పరిష్కరించేంత వరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీలపై రోజురోజుకూ పనిభారం పెరుగుతుందన్నారు. ఐదేళ్లుగా టిఎలు చెల్లించలేదని, రకరకాల యాప్‌లను తీసుకొని పని భారాన్ని పెంచారని, అంగన్వాడీలకు ఇచ్చిన సెల్‌ఫోన్లు పనిచేయడం లేదని, తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి నేటికీ చెల్లించడం లేదని విమర్శించారు. కేంద్రాల బలోపేతానికి నిధులు పెంచి అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సరళ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ ఒక్కటీ అంగన్వాడీలకు అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం అందించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనకు జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తరలివచ్చారు.



సొమ్మసిల్లిపోయిన అంగన్‌వాడీ హెల్పర్ అరుణ

సొమ్మసిల్లిన అంగన్వాడీ హెల్పర్

అంగన్వాడీలు చేపట్టి నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సాలూరు పట్టణానికి చెందిన అంగన్వాడీ హెల్పర్ డోకల అరుణ ఒక్కసారిగా సొమ్మసిల్లి కింద పడిపోయారు. పక్కనే ఉన్న అంగన్వాడీలు, మహిళా కానిస్టేబుల్ ఆమెకు సపర్యలు చేయడంతో స్పృహలోకి వచ్చింది.

సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా

పాలకొండ రూరల్: సమస్యలు పరిష్కారం కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. తొలుత స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ అంగన్వాడీల చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లనీయకుండా ఎక్కడికక్కడ కార్యకర్తలను ప్రభుత్వం పోలీసులతో నిర్బంధం, అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. జీవో 1ను రద్దు చేయాలని, అంగన్వాడీలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు మరిన్ని సమస్యలు సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఐక్య పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఎం.తిరుపతిరావు, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి బి.అమరవేణి, నాయకులు ఎన్.హిమప్రభ, జి.శారద, ఆర్.భవాని, బి.కన్య, ఎ.దర్శని, బి.పార్వతి, పి.అంజలి, సిఐటియు మండల కార్యదర్శి కాద రాము, కార్యవర్గ సభ్యులు ఎం.వీరనాయుడు, నాలుగు మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆందోళననుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతిలక్ష్మి:



పాలకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



విద్యార్థినికి నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్నిఅందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, పక్కన యుటిఎఫ్ నాయకులు

ఇష్టపడి చదవాలి : కలెక్టర్

ప్రజ్ఞా వికాస్ విజేతలకు పురస్కారాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

చదువును ఆస్వాదించాలని, విద్యార్థులంతా ఇష్టపడి చదవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. గతనెల 26న ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రజ్ఞా వికాసం పరీక్షలో మొదటి స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు సోమవారం కలెక్టర్‌తో పాటు యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎస్.మురళీ మోహనరావు, జిల్లా కార్యదర్శి కె.భాస్కరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ చేతుల మీదుగా నగదు పురస్కారాలు, మెమోంటోలు అందించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రజ్ఞ వికాస పరీక్షకు జిల్లా వ్యాప్తంగా సుమారు 5వేల మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. వీరిలో 98 మార్కులతో ప్రథమ విజేతగా నిలిచిన సాలూరులో గల దీప్తి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థి సిహెచ్ అవృతవర్షిణికి రూ.5వేలు నగదు, 97 మార్కులతో ద్వితీయ విజేతగా నిలిచిన పార్వతీపురం పట్టణంలోని కెపిఎం పాఠశాల విద్యార్థి జంగట గాయత్రీకి రూ.3వేల నగదు, 91 మార్కులతో తృతీయ విజేతగా నిలిచిన గుమ్మలక్ష్మీపురంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి మణికంఠకు రూ.2వేలు, పురస్కారం అందించారు. అలాగే పార్వతీపురం పట్టణ పరిధిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన కెవి తేజస్విని (డివిఎంఎం హై స్కూల్), ఆర్.అనూష (టిఆర్ఎంఎం గర్ల్స్ హై స్కూల్), టి.యోగేంద్ర (శ్రీకష్ణ ఇంగ్లీష్ మీడియం స్కూల్). అలాగే పార్వతీపురం రూరల్ పరిధిలో మొదటి మూడు స్థానాలో నిలిచిన హెచ్. నాయుడు, శరత్ కుమార్, బి.నీల్లమ్మ విజేతలుగా నిలవగా, వీరికి ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ లోగోలతో కూడిన మెమోంటోలు, సాహిత్యని పెంచే పుస్తకాలు అందించారు. ఎటువంటి భయాందోళన లకు, ఒత్తిళ్లకు గురి కాకుండా బాగా చదివి, పరీక్షలో మంచి ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.సింహాచలం, కె.భాస్కరరావు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తప్పని డోలీమోత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మారుమూల గిరిజన గ్రామాల్లో వైద్యం నేటికీ అందని ద్రాక్ష గానే మిగిలింది. వైద్యం కోసం గిరిజనులు పడరాని పాట్లు పడుతున్నారు. కొండలపై గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులకు వైద్యం కరువైంది. ఈ గ్రామాలకు రోడ్డు, విద్య, వైద్యం, తాగునీరు సౌకర్యాలు కల్పించాలని గిరిజనులు, గిరిజన సంఘాల నాయకులు ప్రజా ప్రతినిధులకు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదు. దీంతో వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు వైద్యం కోసం వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తుంది. ముఖ్యంగా గర్భిణులకు వైద్యం కోసం డోలీల మోత తప్పడం లేదు. దీంతో గిరిజనులకు ఇబ్బందులు తప్పడంలేదు.



డోలీపై సంధ్యను ఆస్పత్రికి తరలిస్తున్న బంధువులు

మండలంలోని శిఖర పాయి గ్రామానికి చెందిన గిరిజన గర్భిణీ తోయక సంధ్యకు సోమవారం నొప్పులు రావడంతో డోలి సాయంతో మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న వామసీ గ్రామం వరకు తీసుకువచ్చారు. అక్కడ నుంచి తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సకాలంలో వైద్య సేవలు అందించడంతో ప్రాణాపాయం తప్పింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

భూ కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి-బొబ్బిలి

రామభద్రపురం మండలంలోని భూ కబ్జాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. భూ కబ్జాలపై ఎన్‌జిఒ హోంలో సోమవారం సిపిఎం, జనసేన ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పి.శంకరరావు, పిసిసి సభ్యులు ముద్దల శ్రీనివాసరావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, సిపిఐ జిల్లా నాయకులు కోట అప్పన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం మాట్లాడారు. రామభద్రపురం మండలంలో ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. కొండకెంగువలో రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్రభుత్వ భూమిని ఆక్రమించారన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలున్న భూమికి రికార్డులు మార్చివేసి స్వాహా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. కొట్టక్కి వద్ద జాతీయ రహదారి పక్కన చెరువును అధికార పార్టీ నాయకులు కప్పేసి ఆక్రమించేస్తున్నారని తెలిపారు. నరసాపురం వద్ద ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్నారు. బొబ్బిలి ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వ భూములను, చెరువులను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు కొమ్ము కాస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఈ నెల 27న ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టేందుకు రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించారు. అప్పటికీ స్పందించకపోతే రామభద్రపురంలో రిలే నిరాహార దీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎ. సురేష్, జనసేన నాయకులు మహేష్, ఎఐఎస్ఎఫ్ నాయకులు హరికృష్ణ పాల్గొన్నారు.

సకాలంలో వినతులు పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

స్పందన కార్యక్రమానికి వచ్చిన వినతులను పరిశీలించి తక్షణమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు జెసి ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకట్రావు అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 75 దరఖాస్తులు అందాయి. వీటిలో కొన్ని...

బొబ్బిలి మండలం మోషేవలసకు చెందిన ఎం.నూకరాజు, గ్రామస్తులు ప్రస్తుతం విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం గోపాలరాయుడుపేట పంచాయితీలోనున్న మోషేవలసను పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం ఆర్.వెంకంపేట రెవెన్యూలో చేర్చాలని కోరారు. జియ్యమ్మవలస మండలం వీరబ్రహ్మరుద్రపురానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆ గ్రామానికి చెందిన కె.జ్యోతి వినతిని అందజేశారు. భామిని మండలం మనముకొండలో సర్వేనెంబర్ 57-1లో 14.96 ఎకరాలు సాగు చేసుకుంటున్నామని, ఆ భూమికి పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని ఎన్.అన్నయ్య, ఇతరులు వినతి పత్రం అందజేశారు. సాలూరు మండలం పురోహితునివలసకు చెందిన వి.నాగమణి (కుక్), వి.అరుణకుమారి (వార్డెన్) గా ఎపి మోడల్ స్కూల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. తమకు 18 నెలలు గా జీతాలు రావడం లేదని, వేతనాలిప్పించాలని కోరారు. గరుగుబిల్లి మండలం సన్యాసి రాజుపేట గ్రామానికి చెందిన బి. పావని పెన్షన్, వినికిడి మిషన్ మంజూరు చేయాలని కోరారు. పార్వతీపురం మండలం పెదమరికికి చెందిన వి.శ్రీరంగరాజు, బి.జనార్దన, పంచాయితీ నిధులు దుర్వినియోగం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు అందజేశారు. సీతంపేట మండలం జల్లారకు చెందిన బి.సత్యం వైట్ రేషన్ కార్డ్ అర్హత ఉన్నప్పటికీ ఏడాది నుంచి సరుకులు ఇవ్వడంలేదని కావున రేషన్ ఇప్పించవలసిందిగా కోరారు. బలిజిపేట మండలం నారాయణపురానికి చెందిన ఎస్.అన్నపూర్ణ పాత సదరం సర్టిఫికెట్ రద్దుచేసి కొత్త సదరం సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధశాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

నలుగురు విద్యార్థులు డిబార్

ప్రజాశక్తి-పార్వతీపురం

సోమవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం లెక్కలు పరీక్షలో నలుగురు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడడంతో డిబార్ చేసినట్లు అర్ఐఒ ఎం.సత్యన్నారాయణ తెలిపారు. విజయనగరం, కురుపాంలో ఒక్కొక్కరు, పూసపాటిరేగలో ఇద్దరు చూసి రాతకు పాల్పడ్డారని తెలిపారు. పరీక్షకు 28,660 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 26887 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. 1773 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు రాగిజావ

నేడు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

ప్రజాశక్తి-విజయనగరం

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా మధ్యాహ్న భోజన పథకంలో రాగి జావను అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మంగళవారం అమరావతి నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభించనున్నారు. ఉదయం 10.45 గంటలకు ప్రారంభించిన అనంతరం జిల్లాలోని రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తారు. సిఎం నేరుగా విద్యార్థులతో మాట్లాడి భోజనం గురించి వారి అభిప్రాయాలు తెలుసుకోనున్నారు. 8,9 తరగతుల విద్యార్థులతో ముఖ్యమంత్రి ముఖాముఖిలో పాల్గొంటారు. జిల్లా వ్యాప్తంగా 1,41,410 మంది విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం కలగనుంది. విద్యార్థులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం కోసం జిల్లా విద్యాశాఖ అధికారులు రామభద్రపురం జెడ్‌పి హైస్కూల్ లో ఏర్పాట్లు చేస్తున్నారు. డిఇఒ. లింగేశ్వరరెడ్డి, డిప్యూటీ ఇఒ తిరుపతినాయుడు, సమాచార శాఖ సాంకేతిక అధికారులు తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

గిరిజనుల ఆహారపు అలవాట్లే ఆరోగ్యానికి దోహదం

అగ్నిమాపక శాఖ డిఐజి మాదిరెడ్డి ప్రతాప్

ప్రజాశక్తి - కురుపాం

గిరిజనులు ఆచరిస్తున్న ఆహారపు అలవాట్లు ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని అగ్నిమాపక డిఐజి మాదిరెడ్డి ప్రతాప్ అన్నారు. మండలంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న వలసబల్లేరు, కొండబారిడి గిరిజన గ్రామాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు గూర్చి అడిగి తెలుసుకున్నారు. కొండ బారెడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో పండించిన ధాన్యాన్ని దంచే విధానాన్ని పరిశీలించారు. వారు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులు గూర్చి అడిగి తెలుసుకొని గిరిజన మహిళలతో మమేకమవుతూ వారి ఆచారాలు, సాంప్రదాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో మాట్లాడుతూ గిరిజనుల ఆహారపు అలవాట్లు సంపూర్ణ ఆరోగ్యాన్ని కలుగజేస్తాయని ఈ విషయం అమెరికా శాస్త్రవేత్తలు కూడా పరిశోధన చేసి తేల్చారని చెప్పారు. గిరిజనులు తీసుకునే చిరుధాన్యాలు, పెరటి తోటగా ఆకుకూరలు, కాయగూరలు సాగు చేయడం ద్వారా మరింత బలవర్ధకమైన ఆహారాన్ని పొందవచ్చని అన్నారు. రసాయనిక ఎరువులు వాడకుండా గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం అభినందనీయమని ప్రశంసించారు. అనంతరం వలసబల్లేరులోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో జట్టు సమస్త వ్యవస్థాపకులు డి.పారినాయుడు, సిబ్బంది, నీలకంఠాపురం ఎస్ఐ అనిల్ కుమార్, పోలీస్ సిబ్బంది గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఐజి ప్రతాప్

నోటి శుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - కలెక్టరేట్

నోటి శుభ్రతపై అవగాహన ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ప్రపంచ నోటి శుభ్రతా వారోత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం స్థానిక జిల్లా ఆసుపత్రి వద్ద చేపట్టిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. జిల్లా ఆసుపత్రి నుండి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు "బి ప్రౌడ్ అఫ్ మౌత్ " నినాదంతో ర్యాలీ నిర్వహించారు. మార్చి 13 నుండి 20 వరకు జరిగిన "నోటి శుభ్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యాసంస్థలు, అనాథ ఆశ్రమాలు తదితర సంస్థల్లో ఉచిత్ డెంటల్ మెడికల్ క్యాంప్‌ను నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ఉచిత డెంటల్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ నోటి ఆరోగ్యం చక్కగా ఉండేందుకు రోజుకు రెండు సార్లు బ్రెష్ చేయాలన్నారు. బ్రెష్ చేసే విధానాన్ని తెలుసుకోవాలని సూచించారు. నోటి కేన్సర్, పొగతాగడం, మద్యం సేవించడం, ఖైనీలు, గుట్కాలు నమలడం వల్ల వచ్చే అనార్థాలను ఆయన వివరించారు. ప్రతి 6 నెలలకు ఒకసారి డెంటల్ డాక్టర్ వద్దకు వెళ్లి పరీక్షించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ బి.వాగ్దేవి, టిబి జిల్లా నియంత్రణ అధికారి డాక్టర్ ఎ.శ్యామ్ కుమార్, డాక్టర్ శేషగిరి, దంత వైద్యులు డా.ఆర్.శ్యామల, కె. సౌజన్య, డా.దినేష్ కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

ప్రజాశక్తి
www.prajasakti.com



గేటు లేని పాఠశాల భవనం ఇదే

కాంపౌండ్ సరే.. గేటు ఏది?

గుమ్మలక్ష్మీపురం : మండల కేంద్రంలో చింతలగూడ వీధిలో ఉన్న ఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాలలో 10 నెలల క్రితం ఉపాధి హామీ నిధులతో కాంపౌండ్ వాల్ నిర్మించారు. కానీ గేటు మాత్రం వేయకపోవడంతో పశువులు బెడదతో పాటుగా ఆకతాయిల ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది. సాయంత్రం అయితే పాఠశాల ఆవరణలో కొందరు ఆకతాయిలు మద్యం సేవించడంతో పాటు మరుగుదొడ్లును కూడా నాశనం చేయడంతో విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.9లక్షలతో పాఠశాల చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించినా గేటు బిగించకపోవడంతో ఈ అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం లభించిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉపాధి హామీ అధికారులు స్పందించి పాఠశాలకు గేటును నిర్మించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

లెండిలో ఘనంగా ఉత్కర్ష్- 2023

డెంకాడ : జొన్నాడ లెండి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం కళాశాల కంప్యూటర్ సైన్స్ డిపార్ట్మెంట్ స్టూడెంట్ అసోసియేషన్ వార్షికోత్సవం ఉత్కర్ష్ -2023 ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన జీ టెక్నో ప్రొడక్ట్స్ అండ్ సర్వీసెస్ హ్యూమన్ రిసోర్సెస్ మేనేజర్ సావిత్రి ఘడియారామ్ ముఖ్య అతిథిగా హాజరై నేటి తరం అవసరాలకు కంప్యూటర్ సైన్స్ విభాగం నుండే పలు సేవలు అందించబడుతున్నాయని అందుకు ధీటుగా యువ ఇంజనీర్లు, కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి నైపుణ్యాలను పెంపొందించుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. ఈ దిశగా సిఎస్ఇ విభాగం విద్యార్థులను సిద్ధం చేస్తున్నందుకు అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి. రామారెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ అన్ని విషయాల్లో ముందుంటుందని, కంప్యూటర్ సైన్స్ స్టూడెంట్ అసోసియేషన్ ద్వారా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. సంస్థ చైర్మన్ పి మధుసూదన రావు, ప్రసంగిస్తూ విద్యార్థులు విద్యాభ్యాసంతో బాటు మేనేజ్‌మెంట్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఐడియాథాన్, టెక్నికల్ క్విజ్, కోడ్ కన్వర్షన్, ట్రెజర్ హంట్, సిస్టమ్ అన్‌లాకింగ్ పోస్టర్ వంటి పలు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఆదిమళ్ళ రామారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు, ఎవి పరాంకుశం, ప్లేస్‌మెంట్ డీన్ జి. ప్రకాష్ బాబు, అన్ని విభాగాల అధిపతులు, డాక్టర్ రాజన్ బాబు, డాక్టర్ రామారావు, డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ సుబ్బరామయ్య, డాక్టర్ సతీష్ పూజారి, డాక్టర్ దుర్గా శైలజ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం: పోలీసు స్టేషన్‌కు చేరుకున్న ప్రశ్నా పత్రాలు

పోలీసు స్టేషన్‌కు చేరిన టెన్త్ పరీక్షా పత్రాలు

జియ్యమ్మవలస : ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షాలకు సంబంధించిన ప్రశ్నా పత్రాలను విద్యాశాఖ అధికారులు స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం భద్రపర్చారు. రూట్ ఆఫీసర్లు జామి నారాయణస్వామి, శ్రీనివాసరావు భద్రతా సిబ్బందితో జియమ్మవలస తీసుకురాగా, సిఎస్ కెఎస్ కుమార్‌తో కలిసి పోలీస్ స్టేషన్లో ప్రశ్నా పత్రాలను సబ్జెక్టుల వారీగా భద్రపరిచి వాటికి సీల్ వేశారు.

సీతానగరం : వచ్చే నెల 3 నుంచి జరుగునున్న 10వ తరగతి పరీక్ష పత్రాలు సోమవారం సీతానగరం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఇఒ సూర్యదేవుడు మాట్లాడుతూ రెండు సెట్ల చొప్పున పరీక్షా పత్రాలు వచ్చాయన్నారు. వీటిని స్టేషన్‌లో భద్రంగా ఉంచామన్నారు. పరీక్షల సమయంలో వాటిని బయటకు తీస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.



వాహనాలను వేలం వేస్తున్న పోలీసులు

రూ.96,420కు వాహనాల వేలం

సాలూరు : స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన వాహనాల వేలంపాటలో నాలుగు వాహనాలను రూ.96,420కు కొందరు దక్కించుకున్నారు. నాలుగు ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోల కోసం పిలిచారు. సిఐ సిహెచ్.శ్రీనివాసరావు, ఎక్సైజ్ అధికారుల సమక్షంలో వేలం పాట జరిగింది. వీటిలో మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో మాత్రమే రూ.96,420కు పాడుకున్నారని సిఐ శ్రీనివాసరావు తెలిపారు.

సాలూరు: రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన వాహనాల వేలంపాటలో తొమ్మిది ద్విచక్ర వాహనాలను 2,24,500 రూపాయలకు పాడుకున్నారని ఎస్ఐ ప్రయోగమూర్తి చెప్పారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి

వంగర : గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వస్తున్న ఫిర్యాదులపై స్పందించాలని ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే కచ్చితంగా స్పందించాలన్నారు ఈ సమావేశంలో తహశీల్దార్ డి. ఐజక్ ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి లోపింటి త్రినాధరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

రేగిడి : మండల, గ్రామ సచివాలయ పరిధిలో వచ్చిన స్పందన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు సూచించారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీదారుల నుంచి వచ్చిన సమస్యలపై ప్రతి అర్జీకి రసీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. సమస్యను ఎన్ని రోజుల్లో పరిష్కరించాలో ఫిర్యాదు దారునికి తెలియజేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బయోమెట్రిక్ విధానం తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ టీ. కల్యాణ చక్రవర్తి, ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో దరఖాస్తుల వెల్లువ

భోగాపురం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మొట్టమొదటిసారిగా మండల స్థాయి స్పందన కార్యక్రమం ఏర్పాటు చేశామని ఎంపిడిఒ డి. బంగారయ్య తెలిపారు. అధికారులు, పంచాయితీ కార్యదర్శుల సమక్షంలో స్పందనా కార్యక్రమం ఏర్పాటు చేశామని దీనికి స్పందన లభించిందని చెప్పారు. ముంజేరులో కాలువ నిర్మాణాలు చేయాలని గ్రామస్తులు వినతి ఇచ్చారన్నారు. మొత్తం 20 వినతలు వచ్చాయని వీటిని ఆన్ లైన్‌లో పొందుపరిచి తదుపరి పరిష్కార నిమిత్తం సంబంధిత శాఖలకు పంపిస్తామని చెప్పారు.

సొంత డబ్బులతో రోడ్డు నిర్మాణం

- ఇంటికి పదివేలు చందాలతో పనులు
- సంపంగిపాడు గ్రామస్తుల చొరవ

ప్రజాశక్తి- సాలూరు/రూరల్

ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూస్తూ కాలయాపన చేయడం కన్నా తమ గ్రామానికి తామే రహదారి నిర్మాణానికి సిద్ధపడుతున్న గిరిజనుల వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని సంపంగిపాడు గ్రామానికి చెందిన 52 గిరిజన కుటుంబాలు తలా రూ.10వేలు పోగుచేసి రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పంచాయితీ సర్పంచ్ చంద్రయ్య నాయకత్వంలో గిరిజనులు సొంత ఖర్చులతో ఐదు కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి నడుం బిగించారు. తమ గ్రామానికి రహదారి నిర్మాణం చేపట్టాలని గిరిజనులు ఐటిడిఎ, జిల్లా అధికారులు, డిప్యూటీ సీఎం రాజన్నదొర చుట్టూ అనేక సార్లు తిరిగి వినతులు అందజేశారు. కానీ ఫలితం లేకపోవడంతో రహదారి నిర్మాణానికి అవసరమైన డబ్బులను ఎత్తుకున్నారు. డెన్సరాయి నుంచి సంపంగిపాడు గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరం వరకు రహదారి నిర్మాణానికి పనులు చేపట్టారు. గిరిశిఖర గ్రామం సంపంగిపాడుకి రహదారి నిర్మాణానికి



జెసిబితో రోడ్డును వేసుకుంటున్న గ్రామస్తులు

సొంత ఖర్చులతో పాటు శ్రమదానం చేయడానికి కూడా సిద్ధమయ్యారు. మరో వారం రోజుల్లో రహదారి నిర్మాణం పూర్తి చేయనున్నారు. డెన్సరాయికి ఒక కిలోమీటరు దూరం వరకు ఒడిశా ప్రభుత్వం రాళ్ళగెడ్డ నుంచి బిటి రహదారి నిర్మించింది. దీంతో సంపంగిపాడు గ్రామానికి రహదారి నిర్మించుకుంటే రవాణా సౌకర్యం కలుగుతుందని భావించారు.

ఇంతవరకు తాము సేకరించిన అటవీ ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులను కాలినడకన మోసుకుంటూ గిరిజన సంతలకు గిరిజనులు తీసుకెళు తుండేవారు. ఎన్నాళ్ళీ నడక కష్టాలని భావించిన సంపంగిపాడు గిరిజనులు ప్రభుత్వాల సాయం కోసం ఎదురు చూడకుండా సొంత నిధులతో రహదారి నిర్మాణానికి సిద్ధమయ్యారు. గతంలో కొదమ, కరడవలస గ్రామాలకు చెందిన గిరిజనులు కూడా సొంత ఖర్చులతో రహదారులు నిర్మించుకున్నారు. అదే దారిలో సంపంగిపాడు గిరిజనులు ప్రభుత్వాల కోసం నిరీక్షణ చేయకుండా రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

202 ఎకరాల్లో నష్టం

బలిజిపేట : అకాల వర్షాలకు మండలంలోని సుమారు 2002 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని మండల వ్యవసాయాధికారి శ్రావణ్ కుమార్ తెలిపారు. గత 3 రోజులు మండలంలో కురుస్తున్న వర్షాలకు, గాలులకు మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లిందన్నారు. గ్రామాల వారీగా పొలాలు పరిశీలించి నష్టం అంచనా వేసి తుది నివేదిక అందజేస్తామన్నారు. పంటల సంరక్షణకు పలు సూచనలు చేశారు.

భవన వ్యర్థాల తొలగింపు

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని పలుచోట్ల రోడ్లపైనా, కాలువల్లో వేసిన భవన వ్యర్థాలను మున్సిపల్ అధికారులు సోమవారం తొలగించారు. 'కాలువల్లో, రోడ్లపై భవన వ్యర్థాలు' అన్న శీర్షికన ప్రజాశక్తిలో సోమవారం ప్రచురితమైన వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించారు. సంబంధిత భవన నిర్మాణ యజమానులకు హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో వారు ఆ వ్యర్థాలను తొలగించారు. దీంతో స్థానికులు ఊరిపి పీల్చుకున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



కురుపాం: ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, రక్త హీనత నివారణకు వారితో ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు మింగించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాధరావు అన్నారు. రక్తహీనత (ఎనీమియా)తో బాధ పడుతున్న ప్రతి విద్యార్థులకు ప్రతి రోజు పాఠశాలల్లో ఉపాధ్యాయులతో కలిసి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు మింగేలా చూడాలని ప్రోగ్రాం అధికారులను ఆదేశించారు. విద్యా సంవత్సరం ముగుస్తున్న తరుణంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించడంపై ప్రోగ్రాం అధికారులతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సోమవారం సమీక్షించారు. ఎనీమియా ముక్త్ భారత్ ప్రోగ్రాంలో భాగంగా ప్రోగ్రాం అధికారులు గర్భిణిలు, బాలింతలకు హీమోగ్లోబిన్ పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో గర్భిణిలు, బాలింతలు, ఎన్‌సిడి పేషంట్స్ అందరినీ తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. ఎన్‌సిడి, సిడి సర్వేలో రాష్ట్రంలో నాలుగో స్థానంలో ఉన్నామని దాన్ని మరింత మెరుగైన స్థానానికి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో అన్ని ఆరోగ్య కార్యక్రమాలు మరింత ప్రగతి దిశగా వెళ్లాలని, గర్భిణులకు పిఎంఎంవివై, ఇజెఎస్ఎస్‌వై పథకాల కింద చెల్లింపులు జరగాలని ఆయన అన్నారు. ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో శత శాతం డేటా ఎంట్రీ కావాలని చెప్పారు. జిల్లాలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లపై ప్రత్యేక దష్టి సారించాలి ఆయన ఆదేశించారు. సమావేశంలో ఆర్.ఎస్‌కె ప్రాజెక్టు అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిల తనిఖీ

బలిజిపేట: మండలంలోని బలిజిపేట, అరసాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సోమవారం సందర్శించారు. ఈ మేరకు ఆయన రోగుల ఆరోగ్య తనిఖీల నిర్వహణ రికార్డులను, రక్త పరీక్షలు, మందులు, డెలివరీకి మొదలగు రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. వీటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. రోగులు ఆసుపత్రికి వచ్చిన దగ్గర నుంచి తిరిగి వెళ్ళే వరకూ వారికి ఆసుపత్రిలో కల్పించబడిన మౌలిక సదుపాయాలు, అందజేస్తున్న ఆరోగ్య సేవలను పరిశీలించారు. తాగునీరు, వెయిటింగ్ హాల్, వార్డు, డెలివరీ రూమ్, ల్యాబ్, టాయిలెట్లు పనితీరు, మందులు వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించి వీటి నిర్వహణలో సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు. ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా గర్భిణులను ప్రోత్సహించాలని, అందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని, మాతా శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతి ఆరోగ్య కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని డిఐఒ జగన్మోహనరావు ఈ సందర్భంగా సూచించారు. అనంతరం ఆయన వెంగాపురంలో నిర్వహించిన వైఎస్ఆర్ కంటివెలుగు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ సునీత కంటి వెలుగు కార్యక్రమంలో పలువురికి తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ యు.మహిపాల్, జి. శశిధర్, సూపర్‌వైజర్లు చంద్రావతి, సత్యవతి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బలిజిపేట: పిహెచ్‌సి సిబ్బందితో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహన్‌రావు



మాట్లాడుతున్న డిఎంఅండ్ హెచ్‌ఒ జగన్నాథరావు

నడుకూరులో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని నడుకూరు గ్రామంలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైద్యాధికారి పి ఉమామహేశ్వరి వృద్ధులు, చంటి పిల్లలు, మధుమేహ, రక్తపోటు, జ్వర పీడిత, గర్భిణుల, తదితరమైన పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఓ శాంతకుమారి, ఎఎన్ఎం సరస్వతి, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నోటి ఆరోగ్యం కోసం నియమాలు

కురుపాం : ప్రతి ఒక్కరూ నోటి ఆరోగ్యం కోసం తప్పనిసరిగా కొన్ని నియమాలు పాటించాలని దంత వైద్య అధికారి ఆర్. సుకృత అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవ సందర్భంగా సోమవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి కురుపాం బస్టాండ్ వరకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తీపి పదార్థాలతో పాటు శీతల పానీయాలు వినియోగం పూర్తిగా తగ్గించాలన్నారు. ప్రతిరోజు రెండు సార్లు విధిగా బ్రష్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఆరోగ్యం చాలా విలువైందని, కావున ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యానికి కాపాడుకోవాలని స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు అన్నారు. వరల్డ్ హెల్త్ డే సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం హెల్త్ మిషన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఏ ఒక్క ఆరోగ్య సమస్య వచ్చినా వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. అలాగే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించడానికి మేము సైతం ముందడుగు వేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎం ఒ.గౌరీశంకర్, వైద్యులు రాజేష్, వెంకట్రావు, రేఖ తదితరులు పాల్గొన్నారు.

భూసారం పెంపే లక్ష్యం కావాలి

ప్రజాశక్తి - పాచిపెంట

రానున్న ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతులకు భూసారాన్ని పెంచేందుకు, చిరుధాన్యాలపై అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, వేసవికాలం అంతా దీనిపైనే పనిచేయాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. మండలంలో ఏర్పాటు చేసిన గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి సేద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడప గడపకు నవధాన్యాలు- ప్రతి రైతుకు చిరుధాన్యాలు అనే నినాదంతో రైతుల సమావేశాలు, ర్యాలీలు జరపాలని, గ్రామాల్లో నవధాన్యాలు, చిరుధాన్యాల ఆవశ్యకతను తెలియజేసే పాటలను రామ మందిరం వద్ద వినిపించాలని సూచించారు. రానున్న ఖరీఫ్ సీజన్లో దిగుబడులు పెరగాలంటే భూసారంగా పిలవబడే సేంద్రీయ కర్బనాన్ని పెంచాలని, పశువుల గెత్తం లభ్యత లేని ఈరోజుల్లో సేంద్రీయ కర్బనాన్ని పెంచాలంటే నవధాన్యాలను సాగు చేసి కలియ దున్నడమే ఏకైక మార్గమని అన్నారు. కావున నవధాన్యాల సాగుపై రైతుల్లో విస్తతమైన అవగాహన కల్పించాలని కోరారు. నవధాన్యాల సాగువల్ల భూమిలో జీవవైవిధ్యం పెరిగి పంటల వేర్ల దగ్గర జీవ ద్రవ్యం అభివృద్ధి చెంది పంటలు ఆరోగ్యంగా పెరుగుతాయని అన్నారు. అంతేకాక వానపాముల వృద్ధి కూడా జరుగుతుందని, సూక్ష్మ స్థూల పోషకాలు సమపాళ్లలో పంటకు లభిస్తాయని, గాలి, నీరు సమపాళ్లలో భూమిలో నిల్వ ఉండడం వల్ల వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెందడమే కాకుండా భూమిలో ఉన్న పోషకాలను గ్రహించి పంటకు అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన పంట పండించడంలో సహాయపడుతుందని అన్నారు. కావున గడపగడపకు నవధాన్యాలు ప్రతి రైతుకు చిరుధాన్యాలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అప్పుడే రైతులకు వీటిపై అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో విఎఎలతో పాటుగా ఎంసిఆర్‌పిలు యశోదమ్మ, బాలకృష్ణ, తిరుపతి నాయుడు పాల్గొన్నారు.



సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న ఎఒ తిరుపతిరావు

విద్యార్థి డిబార్

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన ఇంటర్ మొదట సంవత్సర పరీక్షలకు 479 మంది విద్యార్థులకు గాను 451 విద్యార్థులు పరీక్ష రాయిగా, 28 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి హరికృష్ణ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో బోటని, గణితం-1, పౌరశాస్త్రం పరీక్షలు జరిగాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ విద్యార్థి మాల్ ప్రాక్టీస్ రాస్తుండగా ఫ్లేయింగ్ స్క్వాడ్ డిబార్ చేసినట్లు తెలిపారు.

'అసెంబ్లీలో రౌడీల్లా వైసిపి ఎమ్మెల్యేలు'

ప్రజాశక్తి- సాలూరు

దేవాలయం లాంటి అసెంబ్లీలో వైసిపి ఎమ్మెల్యేలు రౌడీల్లా వ్యవహరించారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు జి.సంధ్యారాణి ఆరోపించారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ టిడిపి ఎమ్మెల్యే పై వైసిపి ఎమ్మెల్యేలు మంత్రులు దాడి చేయడం ప్రజాస్వామ్యంలో బ్లాక్ డే లాంటిదన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు పట్టభద్రుల స్థానాలను టిడిపి కైవశం చేసుకోవడాన్ని వైసిపి నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. అసెంబ్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న టిడిపి ఎమ్మెల్యేపై అధికారపార్టీ ఎమ్మెల్యేలు దాడికి దిగడం అమానుషమన్నారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంధ్యారాణి డిమాండ్ చేశారు.

చిరంజీవిరావుకు అభినందనలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన వేపాడ చిరంజీవిరావును కురుపాం, సాలూరు నియోజకవర్గాల టిడిపి ఇంచార్జులు తోయక జగదీశ్వరి, గుమ్మడి సంధ్యారాణి కలిసి అభినందించారు. చిరంజీవి రావు గెలుపుతో వైసిపి ప్రభుత్వ అసమర్థ పాలనపై ప్రజల్లో తిరుగుబాటు వచ్చిందని జగదీశ్వరి పేర్కొన్నారు. ఇదే జోష్‌తో 2024 ఎన్నికల్లో కూడా రాష్ట్రంలో టిడిపి గెలుపు ఖాయమని ఆమె అన్నారు.



చిరంజీవిరావును అభినందిస్తున్న నాయకులు

రోడ్డుకు మరమ్మతులు చేయాలని వినతి

ప్రజాశక్తి- పాలకొండ

మండలంలోని బాసూరు గ్రామ ప్రధాన రహదారి కోతకు గురైందని పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్‌కు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు గర్భాన సత్తిబాబు, కూరంగి నాగేశ్వరరావు సోమవారం వినతి పత్రం అందజేశారు. భాసూరు గ్రామ సమీపంలోని బంగారమ్మ తల్లి గుడి దగ్గర జంపరకోట గెడ్డ ఇటీవల కురిసిన వర్షాలకు అత్యధిక నీటి ప్రవాహం వల్ల జంపరకోట గెడ్డ కోతకు గురైందని, సుమారు 20 అడుగులు రోడ్డును రెవెన్యూ అధికారులు పరిశీలించి, మరమ్మతులు చేపట్టాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం జనసేన నాయకులు గర్భాన సత్తిబాబు మాట్లాడుతూ రెండు సంవత్సరాలు నుంచి వర్షాల కారణంగా తారు రోడ్డు కోతకు గురవుతూ వస్తుందని, ఇంత వరకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం అన్యాయం అన్నారు. ఈ రోడ్డు కోతకు గురికావడం వల్ల దాదాపు పది గ్రామాలకు రాకపోకలు ఇబ్బందికరంగా మారుతున్నాయన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్‌ను విన్నవించారు.



వీరఘట్టం: పంట నష్టాన్ని పరిశీలిస్తున్న జనసేన నాయకులు

పక్కా గృహాలు మంజూరు చేయండి

పార్వతీపురం టౌన్: కొమరాడ మండలం పాలెం పంచాయతీ మర్రిగూడ గ్రామస్తులకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని జనసేన నాయకులు ఐటిడిఎ ప్రాజెక్టు పిఒ సి.విష్ణు చరణ్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో పిఒకు వినతిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలోని 56 నివాసాలకు గానూ 30 ఇళ్ల వరకు పూరిగుడిసెలు ఉన్నాయన్నారు. వాటికి పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే గ్రామం నుంచి పాలెం జంక్షన్ రావికోన వరకు రహదారి సదుపాయం కల్పించాలన్నారు. గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలని కోరారు. దీనికి పిఒ స్పందిస్తూ పక్కా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. తాగునీరు రోడ్డు సదుపాయానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి

వీరఘట్టం : మండలంలో కురుస్తున్న అకాల వర్షాలు, పెనుగాలుల కారణంగా అరటి మొక్కజొన్న పంటలు నాశనం అయ్యాయని తక్షణమే రైతులకు నష్టపరిహారం చెల్లించాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండలంలోని బిటివాడ, నడుకూరు తదితర గ్రామాలను సందర్శించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు సతివాడ వెంకటరమణ, గర్భాపు నరేంద్ర, కర్నేని సాయి పవన్ మాట్లాడుతూ వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసినప్పటికీ అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బ తినడంతో రైతులు నష్టపోయారన్నారు. మరికొద్ది రోజుల్లో పంట చేతికి వచ్చే తరుణంలో వీటి ప్రభావం కారణంగా పంటలు నాశనం కావడంతో రైతన్నలు అప్పుల ఊబిలో కురుకుపోతున్నారని చెప్పారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.



పాలకొండ: సబ్ కలెక్టర్‌కు వినతి పత్రమిస్తున్న నాయకులు

ఘనంగా మిల్లెట్స్ మహోత్సవం

డెంకాడ : స్థానిక వైకేపి కార్యాలయంలో సోమవారం 'అంతర్జాతీయ మిల్లెట్స్ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మిల్లెట్స్ (చిరుధాన్యాలు) తో తయారు చేసిన వంటకాలు పోటీని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పాల్గొని వివిధ రకాల చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. ఇందులో గెలిపొందిన విజేతలకు ఎంపిడిఒ డి. స్వరూపారణి చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఐదుగురు విజేతలను ఎంపిక చేసి వారిలో ముగ్గురును జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం విజయలక్ష్మి, ఎఒ, సిసిలు సూరిబాబు, నర్సింగరావు, బి.సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

వంగర: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. చిరుధాన్యాల మహోత్సవం సందర్భంగా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వివిధ గ్రామాల మహిళలు చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రదర్శించడంతో ఈ మేరకు ఆయన వాటిని పరిశీలించి రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఓని అగ్రహారం, వివిఆర్ పేట, అరసాడ మహిళలకు బహుమతులు అందజేసి అభినందించారు.